రాయితీకి కత్తెర..

- పప్పుశనగ విత్తన రాయితీకి కూటమి ప్రభుత్వం కోత
- ఏకంగా 25 శాతానికి కుదింపు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

ఉరవకొండ: అన్నదాతలకు పప్పుశనగ విత్తనాల కొనగోలు భారంగా మారింది. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసింది. గత ఏడాదికి సంబంధించిన ఉచిత పంటల బీమా కింద రావాల్సిన పరిహారంపై కూడా ప్రభుత్వం నోరు మెదపడం లేదు. దీనికి తోడు విత్తన పప్పుశనగపై అందించే రాయితీని కుదించింది. కరువు పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సబ్సిడీ పెంచి విత్తన పప్పుశనగ అందించాల్సి ఉంది. అయితే కూటమి సర్కార్ సబ్సిడీ కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో రైతుకు గరిష్టంగా 2 క్వింటాళ్లు


రబీలో పప్పుశనగ సాగు చేసే రైతులకు 25 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బయట మార్కెట్లో క్వింటా పప్పుశనగ ధర రూ.7 వేల నుంచి రూ 7,500 ధర పలుకుతోంది. అయితే ప్రభుత్వం రూ.9,400 రూ12,100 ధరను పెట్టింది. జేజీ-11 క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోను క్వింటాకు రూ.7,050 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. కేఏకే-2 రకం క్వింటా ధర రూ.12,100 ఉండగా.. రాయితీ రూ.3,025 పోనూ రైతులు రూ.9,075 చెల్లించాలి. ఒక్కో రైతు గరిష్టంగా 200 కిలోలు అంటే 2 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఒక ఎకరా ఉన్న రైతుకు 40 కిలోలు, రెండు ఎకరాలు ఉన్న రైతుకు 80 కిలోలు, ఐదు ఎకరాలు ఉన్న రైతులకు 200 కేజీలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ఉరవకొండలో రైతులకు సబ్సిడీ పప్పుశనగ పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

వైఎస్సార్‌సీపీ హయాంలో 40 శాతం రాయితీ..

గత రబీలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా-పీఎం కిసాన్ అందించింది. జూలై నెలలోపు ఉచిత పంటల బీమా కింద పెద్ద ఎత్తున పరిహారం కూడా మంజూరు చేసింది. అలాగే రబీలో విత్తన పప్పుశనగపై 40 శాతం రాయితీ అందించి, రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంది. అప్పట్లో క్వింటా పప్పుశనగ రూ.8,100 కాగా.. అందులో 40 శాతం అంటే రూ.3,240 పోనూ రైతుల వాటా కింద రూ.4,680 ప్రకారం కట్టించుకున్నారు.



రైతులకు అందించిన సబ్సిడీ శనగ విత్తనం

రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పప్పుశనగ సాగు విస్తీర్ణం వివరాలు..	
మండలం పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ఉరవకొండ	12,189
వజ్రకరూరు	12,477
విడపనకల్లు	10,486
బెళుగుప్ప	6,549
డి.హిరేహాళ్	3,490
కణేకల్లు	9,923
మొత్తం	55,114

రైతాంగానికి సబ్సిడీ భారం

తీవ్ర కరువు పరిస్థితుల్లో పప్పుశనగ రైతులకు కూటమి ప్రభుత్వం సబ్సిడీలో కోత విధించడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల వ్యాప్తంగా పప్పుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 55,114 హెక్టార్లుగా ఉంది. ఆయా నియోజకవర్గాల్లోని మండలాలకు 62,700 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సబ్సిడీ తగ్గించడం దారుణం



రెండేళ్లుగా సకాలంలో వర్షాలు పడటం లేదు. శనగ సబ్సిడీ గత ఏడాది 40 శాతం ఇచ్చారు. ఇప్పుడు 25 శాతానికి తగ్గించడంతో అధిక ధర పెట్టి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. బయట మార్కెట్‌కు మించి ప్రభుత్వం ఇస్తున్న శనగ ధర ఉంది.

– గోపాల్, కమలపాడు గ్రామం, వజ్రకరూరు మండలం

రైతుల కష్టాలు పట్టావా?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనం సరఫరా చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సబ్సిడీని సగానికి కుదించడం సరికాదు. రైతులపై మరింత భారం మోపడం దుర్మార్గం. కరువు పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరం.

– వెంకటరెడ్డి, రాగులపాడు, వజ్రకరూరు మండలం

25 శాతం సబ్సిడీతో ఇస్తున్నాం



ప్రభుత్వం నిర్ణయించిన మేరకు 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందిస్తున్నాం. ఇప్పటికే పప్పుశనగను ఆయా రైతు సేవా కేంద్రాలకు చేర్చాం. అర్హులైన ప్రతి రైతుకు 25 శాతం సబ్సిడీ అందుతుంది. గత ఏడాది రబీ పంట నష్ట పరిహారం ఇంకా విడుదల కాలేదు.

– పద్మజ, ఏడీఏ, ఉరవకొండ డివిజన్

క్లుప్తంగా

ముందస్తు జాగ్రత్తలతో తెగుళ్లకు అడ్డుకట్ట



కొర్రకోడులో కంది పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కూడేరు: పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే తెగుళ్లు ఆశించకుండా అరికట్టవచ్చని మండల వ్యవసాయాధికారి విజయ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొర్రకోడు, హంసాయ పల్లిలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వర్షాలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

ఉరవకొండ: భారీ వర్షాల నేపథ్యంలో ఆయా పంచాయతీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండ రామిరెడ్డి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో రెండు రోజుల పాటు ఆయా పంచాయతీల్లో వీఆర్‌ఓలు, కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వారికి మెడికల్ కిట్లు అందించాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



కరుట్లపల్లిలో భూమిపూజ చేస్తున్న అధికారులు

కూడేరు: మండల పరిధిలోని తిమ్మాపురం, పి.నారాయణపురం, చోళసముద్రం పంచాయతీల్లో రూ.51 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు. బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆయా పంచాయతీల్లో సిమెంట్, డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి భూమి పూజ చేశారు. తిమ్మాపురంలో రూ.10 లక్షలతో 5 సీసీ (సిమెంట్) రోడ్లు, రూ.5 లక్షలతో 5 డ్రైనేజీలు, పి.నారాయణపురంలో రూ.20 లక్షలతో 5 సీసీ రోడ్లు, చోళసముద్రంలో రూ.17 లక్షలతో 4 సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర

రాయదుర్గంటౌన్: అధిక వర్షాలతో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని ఆవులదట్ల గ్రామంలో వర్షాకాలంలో డెంగీ, మలేరియా, అతిసార వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాయదుర్గంటౌన్: ఏపీఎస్ఆర్టీసీ రాయదుర్గం డిపో పరిధిలో 17వ తేదీ గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.సురేష్ తెలిపారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందన్నారు. ఆర్టీసీ రవాణా సౌకర్యాలు, సమస్యలు, సలహాలు, సూచనలపై ఫోన్ నంబర్ 9959225863 తెలియజేయాలని కోరారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాయదుర్గంటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలకు సమస్యలు ఎదురయితే తక్షణం కమాండ్ కంట్రోల్ నంబర్ 9154566253 ఫోన్ చేసి సమాచారం తెలియజేస్తే సహాయ చర్యలు అందిస్తామని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

‘అన్యాయం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాం’

కూడేరు: కూడేరు పొలం సర్వే నంబర్-535లోని ప్రభుత్వ భూమిలో గత 30 ఏళ్లగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఆ భూమిలోకి వెళ్లొద్దని నోటీసులు ఇచ్చారు. తమకు అన్యాయం చేస్తే ఆత్మహత్యలు చేసుకుంటామని మండల పరిధిలోని అరవకూరుకు చెందిన రైతులు స్పష్టం చేశారు. సర్వే నంబర్ 535లోని 450 ఎకరాల్లో ఏపీఐఐసీకి 350 ఎకరాలు, ఎంబిజీ లే-అవుట్‌కు 26 ఎకరాలు కేటాయించడం జరిగింది. ఆ భూమిలో పంటలు సాగు చేసుకున్న రైతులు తొలగించుకోవాలని రెవెన్యూ అధికారులు మూడు రోజులు క్రితం నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. బుధవారం సుమారు 30 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌ను కలిశారు. బలవంతంగా భూములను తీసుకుంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, ధనుంజయ, అలివేలమ్మ, రామాంజనేయులు, గంగాధర్, రాము, ముత్యాలక్క పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అరవకూరు రైతులు

ఘనంగా మారెమ్మ జాతర

శెట్టూరు: మాలేపల్లిలో బుధవారం మారెమ్మ జాతర ఘనంగా జరిగింది. ఐదేళ్లకోసారి నిర్వహించే జాతరను గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య జాతరకు మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా. గ్రామస్తులు సుఖ సంతోషాలు ఉండాలని గ్రామదేవతను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ నాయకుడు బోయ రామాంజినేయులు ఇంట్లో విందును స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు ములకనూరు తిమ్మరాయుడు, గోళ్ల సూరి, బొమ్మయ్య, లాయర్లు హనుమంతరెడ్డి, రామాంజనేయులు, కృష్ణమూర్తి, దీపు, డి.తిప్పేస్వామి, ఎంఎస్ రాయుడు, మల్లేష్, కాశీం, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, రామిరెడ్డి, స్థానిక నాయకులు ఎర్రిస్వామి, శేఖర్, చిక్కన్న, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, మల్లేష్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



జాతరకు హాజరైన మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఉరవకొండ/బెళుగుప్ప/వజ్రకరూరు/కళ్యాణదుర్గం రూరల్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులతో పాటు ఉరవకొండ నియోజకవర్గానికి ఎంతో ముఖ్యమైన హంద్రీనీవా ఆయకట్టు పనులు పూర్తి చేయాలి. ఆ దిశగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ సూచించారు. బుధవారం జిల్లాకు సాగునీటి వనరుల సాధన, సమస్యల పరిష్కారంపై ప్రజలను చైతన్య పరిచేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర బుధవారం ఉరవకొండ,వజ్రకరూరు, బెళుగుప్ప మండలం కాలువపల్లి, రామసాగరం, జీడిపల్లి, కళ్యాణదుర్గాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి కేశవ్‌కు వినతిపత్రం అందించామన్నారు. తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు అమర్చాలన్నారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఎత్తు పోతల పథకం ద్వారా సాగునీరు తరలిస్తామని చెప్పిన కూటమి నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జీడిపల్లికి సక్రమంగా నీరు రాక పోవడంతో ఎక్కడా సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం సాగునీటి విషయంలో సరైన దృష్టి సారించలేదన్నారు.



జీడిపల్లి రిజర్వాయర్ మరువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం బస్సుయాత్ర బృందం

లక్కున్నా.. కిక్కు లేదు!

- మద్యం వ్యాపారులకు టీడీపీ నేతల బెదిరింపులు
- వాటా లేదా..గుడ్‌విల్‌కు ఇవ్వాలని ఒత్తిడి
- మొదటి రోజు ప్రారంభం కాని మద్యం షాపులు
- తలలు పట్టుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

కంబదూరు/ కుందుర్పి/ కళ్యాణదుర్గం రూరల్: మద్యం టెండర్లలో అదృష్టం వరించినా కూటమి నేతల బెదిరింపులతో మద్యం వ్యాపారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మొన్నటి వరకు టెండర్లు వేయడానికి అడ్డుపడ్డ నేతలు ఇప్పుడు వచ్చిన దుకాణాన్ని వదిలేయాలని హుకుం జారీ చేస్తున్నారు. కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కంబదూరు, శెట్టూరు, కుందుర్పి మండలాల్లోని నాలుగు మద్యం షాపులను ఎలాగైనా దక్కించుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన నాయకుల చేత దరఖాస్తు చేయించారు. ఇతర వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవడానికి వెళ్తే బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలో కొంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేశారు. దీంతో టీడీపీ నేతలు ఏమీ చేయలేకపోయారు. అయితే లాటరీలో టీడీపీ నేతలతో పాటు తటస్థులకు దుకాణాలు దక్కాయి.

సిండికేట్ కావాలంటూ ఒత్తిడి..

మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులతో సిండికేట్ అయ్యేందుకు ఎమ్మెల్యే వారి ప్రధాన అనుచరులకు బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే 50 శాతంపైగా వాటా అయినా ఇవ్వాలని లేదా గుడ్‌విల్‌కు అయినా ఇవ్వాలని టీడీపీ నేతలు లైసెన్స్‌దారులను ఒత్తిడి చేస్తున్నారు. తమను కాదని షాపులను ఏర్పాటు చేయడానికి వెళ్తే షాపు యజమానులకు ఫోన్ చేసి షాపులను అద్దెకు ఇవ్వొద్దని, ఇస్తే బాగుండదని టీడీపీ నాయకులు బెదిరిస్తుండడంతో మద్యం షాపులకు అద్దె రూములు ఎవరు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. దీంతో కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాలుగు మద్యం షాపులు బుధవారం ప్రారంభం కాలేదు. ఈ విషయంలో స్థానిక ఎక్సైజ్ అధికారులపై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కుందుర్పిలో మద్యం షాపు దక్కించుకున్న టీడీపీ నేత నాగరాజుకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాను పార్టీ వీడేందుకు కూడా వెనుకాడనని ఆయన తెగేసి చెప్పినట్లు సమాచారం. ఇక కళ్యాణదుర్గంలో మండలంలో కూడా అధికార పార్టీ నేతల బెదిరింపులతో మూడు మద్యం షాపులు ప్రారంభానికి నోచుకోలేదు.

రోజంతా జడివాన!



ఉరవకొండ క్లాక్‌టవర్ వద్ద నిలిచిన వర్షపు నీరు



రాయదుర్గం పట్టణంలో కురుస్తున్న వర్షం

- వాగులు, వంకల్లో పెరిగిన వరద ప్రవాహం
- ముసురు ప్రభావంతో స్తంభించిన జనజీవనం

రాయదుర్గం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రోజంతా జడివాన ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా జడివాన కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, కూలీలకు అవస్థలు పడ్డారు. కళ్యాణదుర్గం డివిజన్‌లోని బెళుగుప్ప మండలంలో 23.6 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదు కాగా, డీ హీరేహాళ్ మండలంలో 2.0 మి.మీ అత్యల్పంగా నమోదైంది. రాయదుర్గం లో 11.4, గుమ్మఘట్ట 15.4, కణేకల్లు 11.0, బొమ్మనహాళ్ 5.2, కళ్యాణదుర్గం 12.8, శెట్టూరు 4.2, కంబదూరు 7.4, బ్రహ్మసముద్రం 12.6, కుందుర్పి 18.2 మి.మీగా వర్షపాతం నమోదైంది.

బీటీ ప్రాజెక్టుకు జలకళ

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బీటీ ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. రిజర్వాయర్ పై భాగాన కర్ణాటక రాష్ట్రంలో విస్తారంగా వానలు కురుస్తుడడంతో సుమారు వెయ్యి క్యూసెక్కుతో ఇన్‌ఫ్లో కొనసాగింది. సముద్ర మట్టానికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం 1648 అడుగులకు అంచెకు చేరాయి. మరోవైపు ప్రధాన జలాశయాలు, వాగులు, వంకల వద్ద ప్రజలను అప్రమత్తం చేస్తూ రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఉరవకొండ: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి క్లాక్‌టవర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచి వాహన దారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ, మాస్టర్ సీపీపీ నగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

కొండను కప్పేసిన పొగమంచు



రాయదుర్గంటౌన్: తుపాను నేపథ్యంలో జడివాన కురుస్తున్న వేళ రెండు రోజుల నుంచి పట్టణానికి ఆనుకున్న కొండను ఉదయం పూట పొగ మంచు కప్పేసింది. బుధవారం జడివాన కురుస్తుండడంతో పాటు కొండను పొగమంచు కప్పిన దృశ్యం ప్రజలను కనువిందు చేసింది.

భక్తిమార్గంలో నడవాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని వివిధ మఠాల పీఠాధిపతులు సూచించారు. బుధవారం గంజికుంట గ్రామంలోని ఉమామహేశ్వర గురుపీఠంలో రెండవ రోజు ఆరాధన మహోత్సవాలు జరిగాయి. మహాత్ముల ఉపన్యాసములు, రాత్రి ప్రదోష పూజలు, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు ప్రణవానందగిరి గురుస్వామి(ఉమామహేశ్వర గురుపీఠం, లత్తవరం), గురుచరణానందగిరి మాతాజీ (గురుశంకరానందగిరి సేవాశ్రమం కొక్కర చేడు), గురుసేవానంద స్వామి (కమలపాడు), అభినవ శంకరానంద స్వామి (శివరామానంద ఆశ్రమం, చాగలమర్రి), శివానంద మాతాజీ (అనాధీశ్వర ఆశ్రమం, విశాఖపట్నం) హాజరయ్యారు. కార్యక్రమంలో ఆశ్రమ ధర్మకర్త మఠం ఉమాదేవి, కార్యకర్తలు హరిప్రసాద్, మామాని రామలింగప్ప, జోహారపురం లక్ష్మన్న, విరుపాక్షి, మల్లికార్జున, బసవరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతులు

నేడు వాల్మీకి జయంతి వేడుకలు

కళ్యాణదుర్గం: ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకను గురువారం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్) నుంచి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో వాల్మీకి సర్కిల్‌లో ఉన్న వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బ్రహ్మసముద్రం : పాలవెంకటాపురం గ్రామంలో గురువారం తలపెట్టిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టను జయప్రదం చేయాలని గ్రామ వాల్మీకి కమిటీ సభ్యులు కోరారు. విగ్రహ దాత, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజవకర్గంలోని వాల్మీకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కుందుర్పి ఆర్ఐగా పోతన్న

కుందుర్పి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పోతన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్ఐ కుళ్లాయప్ప సర్వే డీటీగా పదోన్నతిపై కళ్యాణదుర్గంకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో వజ్రకరూర్ నుంచి పోతన్న వచ్చారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కళ్యాణదుర్గం: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీలో శిక్షణ కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 18–28 వయస్సు మధ్య ఉండాలని, టెన్త్, ఇంటర్ పాస్/ఫెయిల్, డిప్లమో, డిగ్రీ పాస్/ఫెయిల్ వారు అర్హులని పేర్కొన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9000487423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఈ- పంటపై సోషల్ ఆడిట్



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలోని ఈ- పంట నమోదుపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో వేణుగోపాల్, వీఎస్ఏ నాగేంద్ర రైతులకు ఈ- పంట నమోదు పై అవగాహన కల్పించారు. పంట వేసిన ప్రతి రైతు ఈ-పంట ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ పంట జాబితాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జింకపిల్లను కాపాడిన గొర్రెల కాపరులు



ఫారెస్ట్ అధికారిణికి జింక పిల్లను అందిస్తున్న గొర్రెల కాపరులు

కళ్యాణదుర్గం రూరల్: పాలవాయి గ్రామంలోని అటవీప్రాంతంలో కుక్కలు జింకపిల్లను తరుముతుండగా పాలవాయి గ్రామానికి చెందిన గొర్రెలకాపర్లు రక్షించారు. అనంతరం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించి జింకపిల్లను ఫారెస్టు అధికారిణి రామేశ్వరమ్మకు అంజేశారు. ఈసందర్భంగా ఫారెస్టు అధికారిణి గొర్రెలకాపర్లను అభినందించారు.

మట్కాబీటర్ అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో మట్కా చీటీలు రాస్తున్న మహిళను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణంలోని మారెంపల్లి కాలనీలో బోయ సువర్ణమ్మ ఇంటి ఆవరణలో మట్కారాస్తుండగా పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి నుంచి రూ.10,480 నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

22న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22వ తేదీ మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, కోజెంట్ ఈ-సర్వీసస్ సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9182920381 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.